జీఎంసీకు అసోసియేట్ ప్రొఫెసర్

శ్రీకాకుళం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలో ప్రభుత్వ వైద్యకళాశాలకు అసోసియేట్ ప్రొఫెసర్‌గా డా.కె.దినేంద్రరామ్ నియమితులయ్యారు. ఈయన పీడియాట్రిక్స్ విభాగంలో అసోసియేట్ ప్రొఫెసర్‌గా రాజమహేంద్రవరం ప్రభుత్వ వైద్యకళాశాలలో విధులు నిర్వహిస్తున్నారు. అక్కడ నుంచి బదిలీపై శ్రీకాకుళం జీఎంసీకు వస్తున్నారు. ఈ మేరకు రాష్ట్ర వైద్యఆరోగ్య కుటుంబ సంక్షేమశాఖ ప్రభుత్వ కార్యదర్శి డా.మంజులా డి హోస్మాని శుక్రవారం ఉత్తర్వులను జారీచేశారు.

- సామాజిక మాధ్యమాల్లో వైరల్
- ఏడాది కిందట జరిగిన ఘటన.. ఆలస్యంగా వెలుగులోకి
- డీఎస్పీ వివేకానంద నేతృత్వంలో విచారణ
- పోలీసుల అదుపులో నిర్వాహకుడు

సైనిక శిక్షణ పేరిట దాడి



శ్రీకాకుళంలో ఇండియన్ ఆర్మీ కాలింగ్ సంస్థ కార్యాలయం

శ్రీకాకుళం క్రైం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి)

దేశ రక్షణలో చేరేందుకుగానూ యువతకు సైనిక శిక్షణ పేరిట.. ఓ సంస్థ నిర్వాహకుడు దారుణంగా వ్యవహరించాడు. తప్పు చేశారనే ఉద్దేశంతో.. శిక్షణలో భాగంగా యువతపై తీవ్రంగా దాడి చేసి చితకబాదాడు. దాదాపు ఏడాది కిందట జరిగిన ఈ ఘటన దృశ్యాలు.. ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. డీఎస్పీ నేతృత్వంలో పోలీసులు విచారణ చేపట్టి.. నిర్వాహకుడిని అదుపులోకి తీసుకున్నారు. వివరాల్లోకి వెళితే.. 'ఆర్మీ, నేవీ, ఎయిర్‌ఫోర్స్‌లో చేరాలనుకునే యువతకు శిక్షణ ఇస్తాం. ఉద్యోగావకాశాలు కల్పిస్తామ'ని చెప్పి జలుమూరు మండలం శ్రీముఖలింగానికి చెందిన బీవీ రమణ.. శ్రీకాకుళంలో పదేళ్ల కిందట ఇండియన్ ఆర్మీ కాలింగ్ సంస్థను నెలకొల్పాడు. తనే శిక్షణ ఇస్తూ.. నిర్వాహకుడిగా వ్యవహరిస్తున్నాడు. దేశానికి సేవలందించాలన్న లక్ష్యంతో చాలా మంది యువత ఈ సంస్థలో చేరి శిక్షణ పొందుతున్నారు. కాగా.. గతేడాది 2023 డిసెంబర్ 28న ఇచ్ఛాపురం, సంతబొమ్మాళి మండలం ఆర్.హెచ్.పురం, టెక్కలి మండలం దిమిలాడ, పాతపట్నం ప్రాంతాలకు చెందిన ఐదుగురు యువకులు శిక్షణలో తప్పు చేశారని, వారి వల్ల తన పరువు పోయిందని నిర్వాహకుడు బీవీ రమణ ఉక్రోశం చెందాడు. ఈ క్రమంలో ఆ ఐదుగురినీ అతిక్రూరంగా, అమానుషంగా చితకబాదాడు. దాదాపు ఏడాది తర్వాత ఈ దృశ్యాలు.. ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయ్యాయి. ఈ దృశ్యాలు చూసినవారంతా.. శిక్షణ పేరిట ఇంత కిరాతకంగా వ్యవహరించడం దారుణమని ఆరోపిస్తున్నారు. బీవీ రమణ మానసిక పరిస్థితి బాగోలేదని.. ఆయన తీరును విమర్శిస్తున్నారు. కన్నతల్లిదండ్రులే పిల్లలను కొట్టరని.. శిక్షకుడు ఇంత క్రూరంగా ఎలా కొడతారని ప్రశ్నించారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని ఎక్స్ వేదికగా విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌కు విజ్ఞప్తి చేస్తున్నారు. గతంలోనూ రమణ ఇదే తరహా దాడులకు పాల్పడ్డాడని అందులో పేర్కొన్నారు. కాగా అప్పట్లో దాడికి గురైన ఓ బాధితుడు.. శుక్రవారం వన్‌టౌన్ పోలీసులకు ఈ ఘటనపై ఫిర్యాదు చేశారు. శిక్షణ పేరిట తమపై నిర్వాహకుడు దాడి చేశాడని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వన్‌టౌన్ ఎస్ఐ ఎం.హరికృష్ణ తెలిపారు.



శిక్షణ పేరిట యువతను కొడుతున్న బీవీ రమణ (ఫైల్)

డీఎస్పీ విచారణ...

శిక్షణ పేరుతో యువతపై దాడి చేసిన వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో ఈ ఘటనపై శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్ వివేకానంద విచారణ చేపట్టారు. గురువారం రాత్రి రమణను విచారణకు పిలిచే ప్రయత్నం చేయగా.. ఆయన అప్పటికే పరారయ్యాడు. రాత్రంతా పోలీసులు ఆయన ఆచూకీ కోసం గాలించారు. శుక్రవారం శిక్షణ కేంద్రానికి వెళ్లి వెతికినా.. సాయంత్రం వరకూ రమణ కనిపించలేదు. ఎవరికీ అందుబాటులోకి రాలేదు. శ్రీకాకుళం సీఐ కె.పైడపునాయుడు కూడా రమణ కోసం గాలించారు. సంస్థలో కీలకంగా వ్యవహరించిన ఇద్దరిని విచారణ చేయగా.. రమణ పోలీసులకు పట్టుబడ్డాడు. కొన్నేళ్ల కిందట కూడా రమణపై వన్‌టౌన్ స్టేషన్‌లో ఫిర్యాదులు అందాయని పోలీసులు చెబుతున్నారు. ఇటీవల ఆ సంస్థ మహిళల వసతిగృహంలో సీసీ కెమెరాలు ఉన్నాయన్న సమాచారంతో విచారణ కూడా చేపట్టామని డీఎస్పీ వివేకానంద తెలిపారు.

'సాగునీటి సంఘాల'కు రీషెడ్యూల్

- 14న ప్రాదేశిక నియోజకవర్గాలకు ఎన్నిక
- 20న ప్రాజెక్టు కమిటీలకు..

శ్రీకాకుళం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి)

సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం ఎట్టకేలకు తేదీలు ఖరారు చేసింది. ఇప్పటికే మూడు సార్లు ఈ ఎన్నికల నిర్వహణకు తేదీలను ప్రకటిస్తూ పలు కారణాలతో ప్రక్రియను వాయిదా వేసింది. వరుస తుఫాన్‌లు, అల్పపీడనం కారణంగా ఈ నెల 5న జరగాల్సిన ఎన్నిక వాయిదా పడింది. ఈ నెల 14న ఈ ఎన్నికలు నిర్వహించ నున్నట్టు రీషెడ్యూల్‌ను విడుదల చేసింది. సాగునీటి సంఘాల ప్రాదేశిక నియోజక వర్గాలకు 14న ఎన్నికలు జరుగుతాయి. అదేరోజున ఆయా సంఘాలకు అధ్యక్ష, ఉపాధ్యక్షులను ఎన్నుకుంటారు. 17న డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు, 20న ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు నిర్వహిస్తారు. రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా ఈ ఎన్నికలు జరగనున్నాయి. సభ్యులు చేతులెత్తే పద్ధతిలో ఎన్నుకుంటారు. కొంతమంది కోరుకుంటే రహస్యంగా ఓటు వినియోగించుకునేలా ఈ ఎన్నికల్లో అవకాశం కల్పిస్తారు.

ఇదీ జిల్లాలో పరిస్థితి...

జిల్లాలో వంశధార, నారాయణపురం ప్రాజెక్టులకు సంబంధించి సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరుగనున్నాయి. చైర్మన్, వైస్‌చైర్మన్ పదవుల ఎంపిక.. రైతులు చేతులెత్తి ఎన్నుకుంటారు. కూటమి ప్రభుత్వం అనుకూల వర్గం అంతా ఈసారి ఆయకట్టు సంఘాల ఎన్నికల్లో కీలకంగా వ్యవహరిద్దామని భావిస్తోంది. జిల్లాలో మేజర్ వాటర్ యూజర్ అసోసియేషన్‌లు 94, డిస్ట్రిబ్యూటరీ కమిటీలు 21, మైనర్ వాటర్ యూజర్ అసోసియేషన్‌లు 250, అలాగే వంశధార, నారాయణపురం వాటర్ యూజర్స్ కమిటీలు ఉన్నాయి. ఆయకట్టు సంఘాల ఎన్నికలకు సంబంధించి ఈసారి 4,57,954 మంది ఓటర్లుగా గుర్తించారు. ఇతరత్రా పక్కనబెడితే... కీలకంగా ఉన్నవి మాత్రమే అటు నారాయణపురం ప్రాజెక్టు, ఇటు వంశధార ప్రాజెక్టులకు చైర్మన్, వైస్‌చైర్మన్ పదవులపై అందరి దృష్టి ఉంది. ఎన్నికైన వారు జిల్లా అభివృద్ధి సమీక్ష సమావేశాల్లోనూ, జిల్లా పరిషత్ సమావేశాల్లోనూ, నీటి సలహా మండలి, వ్యవసాయ కమిటీ సమావేశాల్లో పాల్గొనేందుకు వీలుంటుంది. ప్రాజెక్టు కమిటీల చైర్మన్‌లకు ప్రొటోకాల్ వర్తిస్తుంది.



వంశధార ప్రాజెక్టు

సమస్యల పరిష్కారమే లక్ష్యం

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
- జిల్లాలో రెవెన్యూ సదస్సులు ప్రారంభం

సరుబుజ్జిలి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సమస్యల పరిష్కారానికే సదస్సులు నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. శుక్రవారం పురుషోత్తపురంలో తహసీల్దార్ ఎల్.మధుసూదన్ అధ్యక్షతన నిర్వహించిన రెవెన్యూ సదస్సులో కలెక్టర్‌తో పాటు ఎమ్మెల్యే కూన రవికుమార్ పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. కలెక్టర్, ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గ్రామాల్లో ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. గ్రామాల్లో సివిల్ సమస్యలు ఉంటే పెద్దలు ద్వారా, లేదంటే సివిల్ కోర్టులో పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రతి రైతూ బాధ్యత గల పౌరుడిగా నీటితీరువా చెల్లించాలని తెలిపారు. భూ హక్కుల వివరాలను గ్రామాల్లో ప్రజలకు తెలియజేయాలని రెవెన్యూ అధికారులను సూచించారు. కాలువలు, చెరువుగర్భాలు, గట్టులపై పట్టాలిచ్చే హక్కు ప్రభుత్వానికి లేదని, అలాంటి వారుంటే ఆయా స్థలాలు ఖాళీ చేయాలని హెచ్చరించారు. జనవరి 8 వరకు నిర్వహించనున్న ఈ సదస్సుల్లో వచ్చే అర్జీలకు 45రోజుల్లో పరిష్కారం చూపాలని కలెక్టర్ ఆదేశించారు. ఆమదాలవలస మండలం తోటాడ బాబాజీ మఠం భూముల సమస్యల గత కొన్నేళ్ల నుంచి పరిష్కారం కాకపోవడంతో రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే రవికుమార్ తెలిపారు. దీనిపై సర్వే నిర్వహించి రైతులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.పావని, కూటమి నాయకులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

అందంగా.. అపురూపంగా

- ఆకట్టుకున్న పీటీఎం ఆహ్వాన పత్రికలు
- నేడు పేరెంట్స్, టీచర్స్ సమావేశం



హిరమండలం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో శనివారం విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశం (పీటీఎం) నిర్వహించనున్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఉపాధ్యాయులు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఈ సమావేశానికి తల్లిదండ్రులను ఆహ్వానించేందుకు విద్యార్థినులు సృజనాత్మకతతో ఆహ్వాన పత్రికలను తయారు చేశారు. హిరమండలం కేజీబీవీ విద్యార్థినులు తయారు చేసిన ఆహ్వాన పత్రికలు (పక్క చిత్రం) విశేషంగా ఆకట్టుకున్నాయి. వాటన్నింటినీ ఒకేచోట చేర్చి ప్రదర్శించారు.



మహిళా హోంగార్డ్‌లకు జ్ఞాపికలతో సత్కరిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

హోంగార్డ్స్ సంక్షేమానికి ప్రాధాన్యం

- ఎస్పీ మహేశ్వరరెడ్డి

8 లో

టీడీపీ కార్యకర్తలపై వైసీపీ మూకల దాడి

10 లో

నిఘా లేని రైల్వేస్టేషన్లే టార్గెట్

- గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు..
- నలుగురు పరారీ

పలాస, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పోలీసులు ఎన్ని దాడులు చేస్తున్నా.. జిల్లాలో గంజాయి అక్రమ రవాణా ఆగడం లేదు. నిఘా లేని రైల్వేస్టేషన్లే లక్ష్యంగా గంజాయి రవాణాకు అక్రమార్కులు యత్నించారు. వారి వ్యూహం బెడిసికొట్టగా.. పోలీసులకు ఇద్దరు నిందితులు చిక్కారు. మరో నలుగురు పరారయ్యారు. ఈ ఘటనకు సంబంధించి పలాస రైల్వే సీఐ ఎ.రవికుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఒడిశాలో కొనుగోలు చేసిన గంజాయిని.. కర్ణాటక రాష్ట్రం బెంగళూరు తరలించేందుకు ఆరుగురు సభ్యులు శుక్రవారం బొలేరో వాహనంపై కంచిలి రోడ్డు(సోంపేట) రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. ఈ స్టేషన్‌లో పోలీసుల నిఘా ఉండదని భావించారు. రైలులో ఎవరికీ అనుమానం రాకుండా మొత్తం 118కిలోల గంజాయిని ఏడు లగేజీ బ్యాగుల్లో పెట్టి తరలించేందుకు సిద్ధమయ్యారు. కాగా.. అక్కడ విధులు నిర్వహిస్తున్న ఆర్‌పీఎఫ్ ఎస్ఐ ఎం.మాల్యాద్రి

(మిగతా 8వ పేజీలో..)



పట్టుబడిన గంజాయి, నిందితులతో రైల్వే పోలీసులు

ఏమైందో..

- ఎస్.ఎం.పురం గురుకుల పాఠశాల విద్యార్థి ఆత్మహత్య
- కన్నీటి పర్యంతమైన తల్లిదండ్రులు



దిలీప్ కుమార్ (ఫైల్)

ఎచ్చెర్ల, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల మండలం ఎస్.ఎం.పురంలోని ఏపీ బాలుర గురుకుల పాఠశాలలో విషాదం చోటుచేసుకుంది. ఈ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ముద్దాడ దిలీప్‌కుమార్(15) గురువారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రెండేళ్ల కిందట ఈ పాఠశాలకు చెందిన తొమ్మిది తరగతి విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడగా.. పెద్ద గొడవ జరిగిన విషయం తెలిసిందే. తాజాగా దిలీప్‌కుమార్ ఆత్మహత్యతో తోటి విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. ఏమైందోనని.. ఎందుకు ఇలా ఆత్మహత్య చేసుకున్నాడోనని విషాదంలో మునిగిపోయారు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. జలుమూరు మండలం పర్లాం మాకివలస గ్రామానికి చెందిన వాసుదేవరావు, లక్ష్మి దంపతుల కుమారుడైన దిలీప్ కుమార్.. ఐదో తరగతి నుంచీ ఈ గురుకుల పాఠశాలలో చదువుతున్నాడు. గురువారం రాత్రి బట్టలు ఆరబెట్టేందుకు తాడు కావాలని దిలీప్ మరో విద్యార్థిని అడిగాడు. తర్వాత రాత్రి 10గంటల సమయంలో విద్యార్థులంతా డార్మెంటరీకి నిద్రించడానికి వెళ్లారు. దిలీప్ చిన్న లైటు పట్టుకుని డార్మెంటరీ నుంచి బయటకు వెళ్లాడు. ఆ రాత్రి ఏమి జరిగిందో కానీ.. తరగతి గది శ్లాబ్‌పైకి ఎక్కి.. అక్కడి నుంచి స్లేడ్‌కు నైలాన్ తాడు కట్టి ఉరేసుకున్నాడు. శుక్రవారం ఉదయం 5గంటల సమయంలో ప్రిన్సిపాల్ గణస్వామి పాఠశాలకు రాగా, విద్యార్థులంతా స్టడీ అవర్‌కు వచ్చారు. దిలీప్‌కుమార్ మాత్రం రాలేదు. దీంతో విద్యార్థులు వెళ్లి చూడగా.. దిలీప్ శ్లాబ్ నుంచి కిందికి నైలాను తాడుతో వేలాడి విగతజీవిగా కనిపించాడు. విషయం తెలుసుకున్న ప్రిన్సిపాల్.. విద్యార్థి తల్లిదండ్రులకు, పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అందించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎన్ఈఆర్, పక్కన ఆర్డీవో సాయి ప్రత్యూష

తల్లిదండ్రుల ఆందోళన

కుమారుడు చనిపోయాడన్న విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు లక్ష్మి, వాసుదేవరావు.. పర్లాం మాకివలస నుంచి గుండెలు బాదుకుంటూ గురుకుల పాఠశాలకు చేరుకున్నారు. కుమారుడు మృతదేహాన్ని చూసి బోరున విలపించారు. మృతిపై అనుమానం వ్యక్తంచేశారు. తమకు సరైన న్యాయం చేసే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని ఆందోళన చేపట్టారు. జేఆర్‌పురం సీఐ అవతారం, ఎస్ఐ వి.సందీప్‌కుమార్ పరిస్థితిని సమీక్షించారు. విద్యార్థి మృతిని ఆత్మహత్యగా కేసు నమోదుచేసి, పోస్టుమార్టం నివేదిక దర్యాప్తు చేస్తామని ఎస్ఐ సందీప్‌కుమార్ తెలిపారు.

ఆర్డీవో, ఎమ్మెల్యే పరామర్శ

శ్రీకాకుళం ఆర్డీవో సాయి ప్రత్యూష, డీఈవో ఎస్.తిరుమల చైతన్య, ఎంఈవో కారు పున్నయ్య, సంఘటనా స్థలాన్ని సందర్శించారు. అలాగే ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు.. గురుకుల పాఠశాలకు చేరుకుని తల్లిదండ్రులతోను, గురుకుల సిబ్బందితో మాట్లాడారు. ఈ సంఘటనపై పూర్తిస్థాయిలో విచారణ

(మిగతా 8వ పేజీలో..)

ఇంట్లోనే వినోదం

● భారీ ఎల్ఈడీ స్ర్కీన్ల ఏర్పాటుపై ప్రజల ఆసక్తి
● ఊపందుకున్న ఓటీటీ సంస్కృతి ● థియేటర్లకు తగ్గుతున్న ఆదరణ

రణస్థలం మండలం కొండములగాం గ్రామానికి చెందిన దన్నాన రఘు ఇంట్లో ఏర్పాటు చేసిన మినీ థియేటర్ ఇది. భారీ ఎల్ఈడీ స్ర్కీన్.. మంచి సౌండ్ సిస్టమ్‌తో థియేటర్‌లో ఉన్న అనుభూతి కలిగేలా దీనిని ఏర్పాటు చేశారు. నెట్ అందుబాటులో ఉండడంతో ఆ స్ర్కీన్‌పై సినిమాలే కాదు.. ఈవెంట్లు, న్యూస్, పిల్లల కార్టూన్ నెట్‌వర్క్.. ఇలా ఎన్నో చానెళ్లను ఇంట్లోనే చూస్తూ వినోదం పొందుతున్నారు.




ఇంట్లో హోమ్ థియేటర్

రణస్థలం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇంటర్నెట్ వినియోగం, ఓటీటీ సంస్కృతి పెరిగిన వేళ.. ఇంట్లోనే భారీ ఎల్ఈడీ స్ర్కీన్ల ఏర్పాటుపై జిల్లా వాసులు ఆసక్తి చూపుతున్నారు. 90వ దశకంలో ఓ సినిమా రిలీజ్ అయితే థియేటర్ వద్ద ఉండే సందడి వేరు. ప్రేక్షకుల ఈలలు, చప్పట్లు మార్మోగేవి. పండుగ పూట ఐదు షోలతో రోజంతా సందడే. ఇప్పుడు అటువంటి పరిస్థితి కనీసస్థాయిలో లేదు. పెద్ద హీరోల సినిమాలైతే పర్వాలేదు కానీ.. చిన్న సినిమాలు ఇలా వచ్చి అలా వెళ్లిపోతున్నాయి. అసలు థియేటర్‌కు వచ్చి సినిమా చూసేవారు కరువవుతున్నారు. దీనికి సాంకేతికతంగా వచ్చిన మార్పులే కారణం. నెట్టింట్లోకి ఇప్పుడు సినిమాలు వచ్చి పడుతుండడంతో థియేటర్‌కు వెళ్లి చూసేందుకు ఎవరూ ఇష్టపడడం లేదు. మరోవైపు మల్టీప్లెక్స్ వచ్చిన తరవాత సగటు సామాన్య ప్రేక్షకుడు సినిమా చూడాలంటే ఆర్థిక భారంగా మారింది. ఈ నేపథ్యంలో చాలామంది ఓటీటీ వైపు మొగ్గు చూపుతున్నారు.

● ఇంటిల్లిపాదీ కూర్చొని..

ప్రస్తుతం ఓటీటీ సంస్కృతి నడుస్తోంది. ప్రతీ ఇంటా ఇంటర్నెట్ వినియోగం పెరిగింది. ఓవైపు సెల్‌ఫోన్లు, మరోవైపు 40, 60 ఇంచీల టీవీలు దర్శనమిస్తున్నాయి. 4కే, 5కే క్యూ ఎల్ఈడీలు.. వీటికి అనుసంధానంగా ప్రత్యేక సౌండ్‌సిస్టమ్‌ను వినియోగిస్తున్నారు. ఇంటి నిర్మాణ సమయంలోనే ప్రత్యేక హోం థియేటర్లను సమకూర్చుకుంటున్నారు. మరోవైపు అమెజాన్ ప్రైమ్, ఆహా, నెట్ ఫ్లిక్స్, జీ5, సోనీ లైవ్ వంటి 48 రకాల ఓటీటీ ప్లాట్ ఫామ్‌లు అందుబాటులోకి వచ్చాయి. దాదాపు వీటి ప్యాకేజీ అంతా రూ.1500లోపే. దీంతో సామాన్య, మధ్యతరగతి ప్రజలు యాప్ లను కొనుగోలు చేస్తున్నారు. ఇంట్లోనే భారీ స్ర్కీన్లపై నచ్చిన చానెళ్లను వీక్షిస్తూ.. వినోదం పొందుతున్నారు. ఈ క్రమంలో థియేటర్లకు ఆదరణ తగ్గుతోంది.

● మూతపడుతున్న థియేటర్లు..

జిల్లాలో గతంలో 100 సినిమా థియేటర్ల వరకూ ఉండేవి. ప్రస్తుతం శ్రీకాకుళంలో ఓ పది థియేటర్లు.. ఇతర పట్టణాల్లో మరో 25వరకూ మాత్రమే కొనసాగుతున్నాయి. వాటికి కూడా ప్రేక్షకాదరణ అంతంత మాత్రమే. చాలా థియేటర్లలో ప్రతిరోజూ నాలుగు షోలు వేయడం గగనంగా మారిపోయింది. ప్రస్తుతం ఈ థియేటర్లన్నీ.. సినీ ఎగ్జిబ్యూటర్లే లీజుకు తీసుకుని నిర్వహిస్తున్నారు. ఆదరణ లేక జిల్లాలో చాలా థియేటర్లు మూతపడడంతో వీటిపై ఆధారపడే వారు ప్రత్యామ్నాయ ఉపాధి మార్గాలు చూసుకుంటున్నారు. ఒక్కో థియేటర్‌లో మేనేజర్, థియేటర్ ఆపరేటర్, సహాయకులు, ఎలక్ట్రీషియన్, స్వీపర్, క్యాంటీన్ అసిస్టెంట్, టిక్కెట్ కౌంటర్.. ఇలా 15మంది వరకూ సిబ్బంది ఉండేవారు. కానీ ఇప్పుడు థియేటర్ల నిర్వహణ భారం కావడంతో 7, 8 మందితో పని కానిచ్చేస్తున్నారు. విద్యుత్ చార్జీలు పెరగడం, రాయితీలు తగ్గడం వంటి కారణాలతో థియేటర్లు మూతపడుతున్నాయి. కొన్ని పట్టణాల్లో థియేటర్లను కళ్యాణమండపాలు, షాపింగ్ కాంప్లెక్స్‌లుగా మార్చేస్తున్నారు.

ఇంట్లోనే చూసుకుంటున్నాం..

గతంలో సినిమా రిలీజ్ అయిన వెంటనే థియేటర్‌కు వెళ్లి చూసేవారం. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. టిక్కెట్ ధరలు పెరగడం, సమయభావం కారణంతో కుటుంబసభ్యులు కలిసిమెలిసి వెళ్లలేని పరిస్థితి. అందుకే ఓటీటీ ప్లాట్‌ఫారానికి అలవాటు పడ్డాం. ఇంట్లోనే కుటుంబ సభ్యులమంతా ఒకే దగ్గర కూర్చొని వినోదాన్ని ఆస్వాదిస్తున్నాం.

-దన్నాన రఘు, కొండములగాం

నిర్వహణ కష్టమే..

థియేటర్‌కు ప్రేక్షకులు రావడం తగ్గుముఖం పట్టింది. కేవలం పెద్ద హీరోల సినిమాలకు మాత్రమే ప్రేక్షకులు కనిపిస్తున్నారు. అదీ హిట్ టాక్ వస్తేనే. ఓటీటీ ప్లాట్‌ఫారంలు థియేటర్లను దారుణం గా దెబ్బతీస్తున్నాయి. కనీసం నిర్వహణ ఖర్చులు కూడా రావడం లేదు.

-శ్రీకాకుళంలోని ఓ థియేటర్ నిర్వాహకుల ఆవేదన

హోంగార్డ్స్ సంక్షేమానికి ప్రాధాన్యం

● ఎస్పీ మహేశ్వరరెడ్డి


గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ

ఎచ్చెర్ల, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): హోంగార్డ్‌ల సంక్షేమానికి అత్యంత ప్రాధానం ఇవ్వనున్నట్టు ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. ఎచ్చెర్ల సాయుధ పోలీసు మైదానంలో శుక్రవారం నిర్వహించిన 62వ హోంగార్డ్స్ డేలో పాల్గొన్న ఆయన మాట్లాడారు. విధి నిర్వహణలో హోంగార్డ్‌లు నూతనోత్తేజంతో మెరుగైన సేవలందించాలన్నారు. స్వచ్ఛంద సంస్థగా ఏర్పడిన హోంగార్డ్స్ ఆర్గనైజేషన్ నేడు పోలీసులకు అనుసంధానంగా పనిచేస్తుందన్నారు. జిల్లాలో ప్రస్తుతం 751 మంది హోంగార్డ్‌లు విధులు నిర్వర్తిస్తున్నారని చెప్పారు. గార పోలీస్ స్టేషన్‌లో హోంగార్డ్‌గా విధులు నిర్వహిస్తున్న రాజేశ్వరి ఇటీవల స్టేషన్ సమీపంలో అర్ధరాత్రి పాముకాటుకు గురైన ఓ మహిళకు తక్షణ వైద్య సాయం అందజేయడంలో సహకరించి ప్రాణాలు కాపాడిందన్నారు. వీఐపీల బందోబస్తు విధుల్లో కూడా హోం గార్డ్స్‌లు సమయపాలన పాటిస్తూ మన్ననలు పొందుతున్నారని చెప్పారు. పోలీసులతో సమానంగా హోంగార్డ్‌లకు కూడా ఆరోగ్య రక్ష పేరుతో వైద్య పరీక్షలు నిర్వహించినట్టు తెలిపారు. ఏటా 13 రకాల వైద్య పరీక్షలు నిర్వహించేందుకు ఉచిత ఆరోగ్య కార్డులు అందించేందుకు చర్యలు చేపడతా మన్నారు. విధి నిర్వహణలో మృతిచెందిన హోంగార్డ్‌లకు ప్రమాద బీమా కింద రూ.10లక్షలు వర్తింపునకు చర్యలు తీసుకున్నామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో డీఎస్పీలు వివేకానంద, శేషాద్రి, ప్రసాదరావు, సీఐలు ఇమ్మాన్యుయేల్ రాజు, అవతారం, ఆర్ఐ నర్సింగరావు, ఆర్ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు. తొలుత హోంగార్డ్స్ కమాండెంట్ శశిభూషణ్ ఆధ్వర్యంలో పరేడ్ నిర్వహించగా, ఎస్పీ గౌరవవందనాన్ని స్వీకరించారు.

హోంగార్డ్‌లకు సత్కారం..

35 ఏళ్ల సర్వీసు పూర్తిచేసిన హోంగార్డ్‌లు కృష్ణవేణి, రాజు, కృష్ణమ్మలకు, అలాగే విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ చూపిన అనూరాధ, విశాలక్ష్మి తదితరులకు ఎస్పీ జ్ఞాపిక అందజేసి సత్కరించారు.

బ్రహ్మోత్సవాల్లో చిన్నారుల నృత్యాలు


అలరించిన చిన్నారుల నృత్యాలు

ఇచ్ఛాపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తిరుమల తిరుపతి దేవస్థానం తిరుచనూరు బ్రహ్మోత్సవాల్లో పట్టణానికి చెందిన డ్యాన్స్ అండ్ మ్యూజిక్ అకాడమీ చిన్నారుల నత్య ప్రదర్శన ఆకట్టుకున్నాయి. ఈ నెల 2, 3 తేదీల్లో శిల్పారామంలో, 5న వాహనసేవలో అకాడమీ చిన్నారులు కూచిపూడి నృత్యాలతో భక్తులను అలరించాయి.

రబీలో ఆరుతడి పంటలకు ప్రోత్సాహం

● వ్యవసాయశాఖ ఏడీ బీవీ తిరుమలరావు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



టెక్కలి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రబీలో ఆరుతడి పంటలు సాగుకు చర్యలు తీసుకుంటున్నామని వ్యవసాయశాఖ ఏడీ బీవీ తిరుమలరావు 'ఆంధ్రజ్యోతి'తో అన్నారు.

ప్రశ్న: రబీలో ఏయే పంటలు వేసుకోవాలి?

జవాబు: వేరుశనగ, పెసర, మినుము, రాగులు, కట్టి జనుము, మొక్కజొన్న తదితర పంటలు సాగు చేసుకోవాలి. వీటికి విత్తనాలను ప్రభుత్వం సబ్సిడీపై అందిస్తోంది.

ప్ర: కోత, నూర్పు శ్రమ తగ్గించేందుకు అవసరమైన కంబైండ్ హార్వెస్టర్ యాంత్రీకరణ పథకాలు ఇచ్చే అవకాశాలున్నాయా?

జ: వ్యవసాయ యాంత్రీకరణలో భాగంగా రైతులకు కోత, నూర్పుల్లో ఖర్చుల భారం తగ్గించేందుకు కంబైండ్ హార్వెస్టర్ టెక్కలి డివిజన్‌కు 40 వరకు అవసరమని ప్రతిపాదనలు చేశాం. దీని ఖరీదు రూ.25లక్షలు కాగా రూ.10 లక్షలు సబ్సిడీ ఉంటుంది. ఈ జిల్లాకు మంత్రి అచ్చెన్నాయుడు ఎక్కువగా సరఫరా చేయాలని ఇప్పటికే సూచించారు.

ప్ర: రబీలో వరి సాగు ఎందుకు వద్దన్నారు?

జ: రబీలో వరి సాగుకు సాగునీటి కొరత ఉంది.. ఈ పరిస్థితి దృష్ట్యా ఇప్పటికే విత్తన డీలర్‌కు రబీలో వరి విత్తనాలు అమ్మవద్దని ఆదేశించాం. రైతు సేవా కేంద్రాల ద్వారా రబీలో వరిసాగు వేయవద్దని అవగాహన కల్పిస్తున్నాం.

ప్ర: ఆరుతడి పంటలకు విత్తనాలిస్తున్నారా?

జ: కట్టిజనుము, రాగులు, వేరుశనగ, మినుము, పెసర, నువ్వు, మొక్కజొన్న తదితర రకాల పంటల వేసుకోవాలని రైతులను కోరాం. పెసర 80 క్వింటాళ్లు, మినుము 60 క్వింటాళ్ల 40 శాతం సబ్సిడీపై రైతులకు అందజేశాం. కట్టిజనుము వంద క్వింటాళ్లు, రాగులు పది క్వింటాళ్ల వరకు అందించాం. నువ్వులు కూడా పది క్వింటాళ్ల విత్తనాలు అందించేందుకు సిద్ధంగా ఉన్నాం.

ప్ర: వేరుశనగ విత్తనాలు ఏ మేరకు సరఫరా చేశారు?

జ: టెక్కలి సబ్ డివిజన్‌లో పాతపట్నం, నందిగాం, టెక్కలి, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి మండలాల్లో 5,500 క్వింటాళ్ల కే6, విశిష్ట రకాల వేరుశనగ విత్తనాలు అందజేశాం. ఈ ఏడాది 32 శాతం సబ్సిడీతో నాణ్యమైన విత్తనాలు అందించడం జరిగింది.

ప్ర: పంటల అధిక దిగుబడికి సూచనలిస్తున్నారా?

జ: క్షేత్రస్థాయిలో ప్రతి మంగళ, బుధవారాలు గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' ద్వారా పంటల్లో అధిక దిగుబడికి సూచనలు, సలహాలు అందిస్తున్నాం. ఈ సీజన్‌లో అపరాల పంటలు దిగుబడికి అవసరమైన సూచనలందించాం.

ప్ర: ధాన్యం కొనుగోలు ప్రక్రియ ఎలా సాగుతోంది?

జ: టెక్కలి నియోజకవర్గ పరిధిలో మొత్తం 66 కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేస్తున్నాం. ఇప్పటికే రైతుల నుంచి ఏడువేల క్వింటాళ్ల ధాన్యం సేకరించాం. రైతు బయోమెట్రిక్ వేసిన 48 గంటల్లో నగదు రైతు ఖాతాల్లో జమవుతుంది.

నిఘా లేని రైల్వేస్టేషన్లే టార్గెట్

(ఏడో పేజీ తరువాయి)

వారి కదలికలు గుర్తించి.. నిఘా పెట్టారు. అనంతరం పలాస రైల్వే పోలీసులు, ఆర్‌పీఎఫ్ సిబ్బందికి అప్రమత్తం చేశారు. రైలులో ఆ బ్యాగులు ఎక్కించే సమయానికి మూకుమ్మడిగా దాడి చేసి గంజాయితో పాటు ఇద్దరు నిందితులను పట్టుకున్నారు. విషయం గుర్తించిన మరో నలుగురు గంజాయి స్మగ్లర్లు పరారీ అయ్యారు. వారి కోసం పోలీసులు తనిఖీలు చేస్తున్నా రు. పట్టుబడిన గంజాయి విలువ పోలీసుల లెక్క ప్రకారం రూ.6 లక్షలు ఉండగా.. బహిరంగ మార్కెట్‌లో రూ.20 లక్షలకు పైగా ఉంటుందని అంచనా. ఒడిశాకు చెందిన గంజాయి ముఠా సభ్యులు బిలాపగొమంగో, మందుదొళాయ్‌ను అరెస్టు చేసి పలాస తీసుకువచ్చామని, శనివారం విశాఖపట్నం రైల్వే కోర్టుకు తరలిస్తు న్నట్టు సీఐ ఎ.రవికుమార్ తెలిపారు. గంజాయి రవాణా చేస్తున్న ప్రధాన నిందితుడు గోపాల్‌గొమాంగో కోసం గాలిస్తున్నామన్నారు. ఆయనకు బెంగుళూరులోని గంజాయి ముఠాతో సంబంధాలు ఉన్నట్టు గుర్తించామ న్నారు. ఆర్‌పీఎఫ్, జీఆర్‌పీ సంయుక్తంగా దాడులు నిర్వహిస్తామని, రైళ్లలో గట్టి నిఘా పెట్టామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం గంజాయి రవాణాపై కట్టుదిట్టమైన చర్యలు చేపట్టిందని, దానికి అనుగుణంగానే బరంపురం నుంచి విశాఖ వరకూ రైళ్లలో తనిఖీలు చేస్తామని స్పష్టం చేశారు. దాడుల్లో ఎస్ఐ ఎండి.షరీఫ్, సిబ్బంది ఉన్నారు.

ఏమైందో..

(ఏడో పేజీ తరువాయి)

చేయాలని పోలీసులకు సూచించారు. విద్యార్థి తల్లిదండ్రులకు రూ.10వేలు పరిహారం అందజేశారు. వారికి అండగా ఉంటామని హామీనిచ్చారు. అనంతరం విద్యాశాఖామంత్రి నారా లోకేశ్‌తో ఫోన్‌లో మాట్లాడి విషయాన్ని చేరవేశారు. ఎమ్మెల్యేతో పాటు జిల్లా టీడీపీ మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి, మాజీ సర్పంచ్ చౌదరి అవినాష్, పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్ గొంటి నర్సింగరావు, బీజేపీ సీనియర్ నేత సంపతిరావు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

నిబంధలు అతిక్రమించొద్దు

● ఇసుక ర్యాంపు పరిశీలించిన కలెక్టర్ పుండ్కర్

సరుబుజ్జిలి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఇసుక తవ్వకాలు నిబంధనల మేరకే చేపట్టాలని, అతిక్రమిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. పురుషోత్తపురం వంశధార నది పరివాహక ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఇసుక ర్యాంప్‌ను శుక్రవారం కలెక్టర్ పరిశీలించారు. పురుషోత్తపురం గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో పాల్గొన్న కలెక్టర్ తిరుగి వెళ్తూ మార్గ మధ్యలో ఉన్న ఇసుక ర్యాంప్‌ను పరిశీలించా రు. కూలీలకు ఉపాధి కల్పించేలా వారితోనే తవ్వించాలని తెలిపారు. ఇసుక తవ్వకాల ర్యాంప్ పరిసర ప్రాంతాలు, సీసీ కెమెరాలు పర్యవేక్షణలో ఉండడం, ఇసుక తరలించే వాహనాలకు బిల్లులు అందించడాన్ని గుర్తించిన కలెక్టర్.. ఇదే పద్ధతి జిల్లా వ్యాప్తంగా అమలు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రోజువారి వాహనాలపై ఆరా తీశారు. అలాగే అక్కడ ఉన్న లారీ డ్రైవర్‌తో మాట్లాడి తవ్వకాల గురించి అడిగి తెలుసుకున్నారు. వాహనదారులు నుంచి ఎవరైనా అక్రమ వసూళ్లు చేపడితే చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. తహసీల్దార్ ఎల్.మధుసూదన్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.


ఇసుక ర్యాంప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ పుండ్కర్

ఇసుక లభ్యత పెంచాలి..

గుజరాతీపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విశాఖ, విజయనగరం జిల్లాల్లో ఇసుక కొరత వల్ల శ్రీకాకుళం జిల్లా పైనే అధిక శాతం ఆధారపడుతున్నారని, అందువల్ల ఇసుక లభ్యత మరింత పెంచాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. ఇసుక లభ్యత, ధరలు, అక్రమ రవాణా, ఇతర ఫిర్యాదులపై కలెక్టరేట్‌లో జేసీ ఫర్మాన్ ఆహ్మద్‌తో కలిసి కలెక్టర్ సమీక్షా సమావేశం నిర్వహించారు. రవాణా, తవ్వకం, వ్యయ భారం వినియోగందారులపై ఎక్కువగా పడకుండా చూడాలన్నారు. జిల్లాలో ఇసుక ధరలపై తరుచూ సమీక్షించాలని, ఇసుక సమస్యలపై టోల్ ఫ్రీ 18004256012 నెంబరులో సంప్రదించాలని కోరారు. అక్రమ రవాణా చేస్తున్న 11 లారీలను ఇటీవల సీజ్ చేశామన్నారు. నిబంధనలు పాటించకపోతే మరిన్ని కేసులు నమోదు చేస్తామన్నారు. ఆర్డీవోలు కృష్ణమూర్తి, సాయి ప్రత్యూష, మైన్స్ డీడీ మోహనరావు, డీఎస్పీ వివేకానంద, సీఐలు, తహసీల్దార్లు, ట్రాన్స్‌పోర్టర్లు, రీచ్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

3.30 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం సేకరణ లక్ష్యం

● జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్


గొడౌన్‌ను ప్రారంభిస్తున్న జేసీ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్

కోటబొమ్మాళి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ ఏడాది 3.30 లక్షల మెట్రిక్ టన్నుల బియ్యం సేకరణ లక్ష్యంగా నిర్ణయించినట్లు జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్ తెలిపారు. నిమ్మాడ, రావిపాడులో సీఎంఆర్ డెలివరి పాయింట్ గొడౌన్లను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 24 పౌరసరఫరా గొడౌన్లు ఉండాలన్నారు. మిల్లుల నుంచి తయారైన బియ్యాన్ని సేకరించి సీఎంఆర్ పాయింట్ల ద్వారా గొడౌన్లలో నిల్వ చేయడం జరుగుతుందన్నారు. మిలర్లంతా లక్ష్య సాధనకు కృషిచేయాలన్నారు. కార్యక్రమం లో టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి జి.సూర్యప్రకాశరావు, సీఈవో టి.వేణుగోపాలరావు, సహాయ మేనేజర్ శ్రీనివాసరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కె.హరి ప్రసాద్. టీడీపీ నేతలు బోయిన రమేష్, వెలమల విజయలక్ష్మి, కామేశ్వరరావు, తర్రా రామకృష్ణ, కోరాడ గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

హైందవ ధర్మ పరిరక్షణకు పాటుపడాలి

● ఎమ్మెల్యే గొండు శంకర్

శ్రీకాకుళం రూరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): హైందవ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. గేదెలవానిపేటలో స్వయంభుగా వెలసిన ఉమామహేశ్వర స్వామి పీఠం ప్రాంగణంలో కల్యాణ వెంకటేశ్వరుని ఆలయ నిర్మాణానికి శుక్రవారం ఎమ్మెల్యే గొండు శంకర్ శంకుస్థాపన చేశారు. ఆధ్యాత్మికతతో మెలిగే వారికి క్రమశిక్షణ అలవడుతుందని, తద్వారా ప్రశాంత జీవనం పొందవచ్చునన్నారు. అనంతరం బంకుపల్లి రామచంద్రమూర్తి శర్మ ఆధ్వర్యంలో ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



చంద్రబాబుకు పుష్పగుచ్ఛం అందిస్తున్న ఎమ్మెల్యే శంకర్

చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యే

శ్రీకాకుళం అర్బన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబును శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. శుక్రవారం విశాఖ పర్యటనకు వచ్చిన చంద్రబాబుకు శంకర్ పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా నియోజకవర్గ సమస్యలు, సభత్వ నమోదు చంద్రబాబుకు ఎమ్మెల్యే వివరించారు.

ముగిసిన టెక్ ఫెస్ట్

● శివానీ విద్యార్థులకు ప్రథమ బహుమతి

ఎచ్చెర్ల, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల (శ్రీకాకుళం)లో రెండు రోజులుగా నిర్వహిస్తున్న ప్రాంతీయ స్థాయి టెక్ ఫెస్ట్-2024 శుక్రవారంతో ముగిసింది. ఈ ఫెస్ట్‌లో 10 పాలిటెక్నిక్ కళాశాలల నుంచి విద్యార్థులు 64 ప్రాజెక్టులు ప్రదర్శించారు. ఇందులో శివానీ పాలిటెక్నిక్ కళాశాల (చిలకపాలెం) ఎలక్ట్రికల్ బ్రాంచ్ విద్యార్థులు రూపొందించిన ప్రాజెక్ట్‌కు ప్రథమ బహుమతిగా రూ.25 వేలు, వెంకటేశ్వర ఫార్మసీ కళాశాల (ఎచ్చెర్ల) కంప్యూటర్ బ్రాంచ్ విద్యార్థులు తయారు చేసిన ప్రాజెక్ట్‌కు ద్వితీయ బహుమతిగా రూ.10 వేలు దక్కించుకున్నాయి. త్వరలో రాష్ట్ర స్థాయిలో జరగనున్న టెక్ ఫెస్ట్‌కు ఈ రెండింటితోపాటు మొత్తం 15 ప్రాజెక్ట్‌లను ప్రదర్శించనున్నారు. శుక్రవారం సాయంత్రం నిర్వహించిన ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమదాలవలస ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ నారాయణరావు మాట్లాడుతూ.. రెండు రోజుల పాటు ఆహ్లాదరకరమైన వాతావరణంలో టెక్‌ఫెస్ట్ జరిగిందన్నారు. ఇలాంటి ఫెస్ట్‌ల వల్ల విద్యార్థుల్లో నైపుణ్యం మరింత పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ బి.జానకిరామయ్య, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి.దామోదరరావు తదితరులు పాల్గొన్నారు. శ్రీకాకుళం నగరంలోని వివిధ పాఠశాలలకు చెందిన సుమారు 1500 మంది విద్యార్థులను ఈ ప్రాజెక్ట్‌లను తిలకించారు.



ప్రథమ బహుమతి అందుకుంటున్న శివానీ కళాశాల విద్యార్థులు

డీజీపీని కలిసిన ఎస్పీ

శ్రీకాకుళంక్రైం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): విశాఖ రేంజ్ డీఐజీ కార్యాలయాన్ని సందర్శించిన డీజీపీ సీహెచ్ ద్వారక తిరుమలరావును శుక్రవారం ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. ఈ సందర్భంగా డీజీపీకి పూల మొక్క అందించి స్వాగతం పలికారు. జిల్లాలో శాంతిభద్రతల పరిస్థితి, గంజాయి, మాదక ద్రవ్యాలు రవాణా తదితర అంశాలపై ఎస్పీ వివరించారు. అలాగే టెక్కలి డీఎస్పీగా బాధ్యతలు చేపట్టిన వీఎస్ఎన్ మూర్తి జిల్లా పోలీసు కార్యాలయంలో శుక్రవారం ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.



డీజీపీకి పూల మొక్క అందిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

కేంద్రాల నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు

జి.సిగడాం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాల నిర్వహణలో అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని జిల్లా పంచాయతీ అధికారి కె.సౌజన్య భారతి హెచ్చరించారు. శుక్రవారం ఎందువ, జి.సిగడాం తదితర గ్రామాల్లో చెత్తసంపద కేంద్రాలను పరిశీలించారు. తడి, పొడి చెత్తలను వేరుచేసి కేంద్రాలకు తరలించాలన్నారు. అనంతరం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమీక్షించారు. డీపీఆర్‌సీ జిల్లా కో-ఆర్డినేటర్ కె.నిశ్చల, ఎంపీడీవో టి.రామకృష్ణ, సర్పంచ్ అల్లు జోగినాయుడు, పంచాయతీ కార్యదర్శులు పొట్నూరు సురేష్, సాహు, సతీష్, పోగిరి రాము, తదితరులు పాల్గొన్నారు.



రికార్డులు పరిశీలిస్తున్న డీపీవో సౌజన్య భారతి

ఉన్నత చదువులతోనే ఆర్థిక స్వావలంబన

సోంపేట, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): అమ్మాయిలు ఉన్నత చదువులు చదివి ఉద్యోగాలు చేస్తూ ఆర్థిక స్వావలంబన సాధించడం ద్వారా తమ కుటుంబాన్ని అభివృద్ధి పథంలో నడపగలరని వ్యక్తిత్వ నిపుణుడు రాంబుడ్డి గణపతి అన్నారు. బారువ డిగ్రీ కళాశాలలో బాలికా విద్య, బాలికా వివాహంపై శుక్రవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ పండి రామకృష్ణ, అధ్యాపకులు టి.రాజేంద్ర, స్నేహలత తదితరులు ఉన్నారు.

13న కూర్మనాథుని ఆలయ హుండీలు లెక్కింపు

గార, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): శ్రీకూర్మంలోని ప్రసిద్ధ కూర్మనాథుని ఆలయంలోని హుండీలను ఈ నెల 13వ తేదీ శుక్రవారం ఉదయం 9గంటలకు తెరచి లెక్కించనున్నట్టు ఈవో జి.గురునాథరావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పూర్వ విద్యార్థుల సమావేశానికి హాజరుకావాలి

గుజరాతీపేట, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పూర్వ విద్యార్థుల సమావేశానికి అందరూ తప్పక హాజరుకావాలని కళాశాల ప్రిన్సిపాల్ సూర్యచంద్రరావు కోరారు. ఈ నెల 7న ప్రభుత్వ మహిళా కళాశాలలో జరగనున్న ఈ అపూర్వ కలయికకు విద్యార్థులంతా హాజరు కావాలన్నారు. ఫ్యామిలీ లవర్స్ సొసైటీతో కలిసి ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమం ఉదయం పది గంటలకు ప్రారంభమవుతుందన్నారు.

బొట్టు పెట్టి ఆహ్వానం



బొట్టుపెట్టి ఆహ్వానిస్తున్న దృశ్యం

కంచిలి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న తల్లిదండ్రుల సమావేశానికి హాజరు కావాలని కోరుతూ మండలంలోని ఎక్కల ప్రభుత్వ పాఠశాల కమిటీ సభ్యులు పిల్లల తల్లిదండ్రులకు బొట్టు పెట్టి ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు సిబ్బంది పాల్గొన్నారు.

● ఇచ్ఛాపురం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పాఠశాల విద్యాశాఖ ఆదేశాల మేరకు శనివారం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ఆత్మీయ సమావేశం అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించనున్నట్టు ఎంఈవో కె.అప్పారావు శుక్రవారం ప్రకటనలో పేర్కొన్నారు. సమావేశంలో విద్యార్థుల ప్రోగ్రెస్ కార్డులు తల్లిదండ్రులకు అందిస్తామని తెలిపారు.

విద్యార్థి మృతిపై నివేదిక ఇవ్వండి

గుజరాతీపేట, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల మండలం ఎస్ఎం పురం సోషల్ వెల్ఫేర్ వసతి గృహ విద్యార్థి ఆత్మహత్యకు పాల్పడడంపై పూర్తిస్థాయిలో నివేదిక ఇవ్వాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్టు రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పరీక్షల ఒత్తిడి ఏమైనా ఉందా?, ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా? అన్న కోణంలో పరిశీలించి నివేదిక ఇవ్వాలన్నారు. నివేదికను అనుసరించి తదుపరి చర్యలకు సిఫార్సులు చేయనున్నట్టు తెలిపారు.

అంబేడ్కర్‌కు నివాళి

శ్రీకాకుళం అర్బన్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): ప్రపంచంలో అతిపెద్ద ప్రజాస్వామ్య రాజ్యాంగాన్ని దేశానికి అందించిన మహోన్నత వ్యక్తి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ అని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అంబటి కృష్ణారావు, జిల్లా ఇన్‌చార్జి గాధ వెంకట త్రినాథరావు అన్నారు. అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం ఇందిరా విజన్ భవన్‌లో ఆయన చిత్ర పటానికి పార్టీ నాయకులతో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

భూ సమస్యల పరిష్కారానికే..

ఇచ్ఛాపురం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): భూ సమస్యలు పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్టు స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ పద్మావతి అన్నారు. శుక్రవారం పురుషోత్తపురంలో తహసీల్దార్ వెంకటరావు అధ్యక్షతన రెవెన్యూ సదస్సు నిర్వహించారు. డీటీ శ్రీహరి, సీఎస్‌డీటీ సంతోష్, వార్డు కౌన్సిలర్ పత్రి తవిటయ్య తదితరులు పాల్గొన్నారు.

సంఘీభావ ర్యాలీకి అనుమతివ్వండి

ఇచ్ఛాపురం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): బంగ్లాదేశ్‌లో హిందువులపై, ఆలయాలపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ చేపట్టనున్న సంఘీభావ ర్యాలీకి అనుమతి ఇవ్వాలని విశ్వహిందూ పరిషత్ సభ్యులు సీఐ మీసాల చిన్నమనాయుడుకు కోరారు. ఈ మేరకు శుక్రవారం సీఐకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ నెల 8న ఆదివారం స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయం నుంచి గోర్టివీధి, రథంవీధి, పంజావీధి, హాస్పటల్ రోడ్, మెయిన్ రోడ్ మీదుగా ఈ ర్యాలీ చేపట్టనున్నట్టు వివరించారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ సభ్యులు పాక తులసీదాస్‌రెడ్డి, వీకే ప్రసాద్, ఎస్.శ్రీను, రాంప్రసాద్ మాస్టారు తదితరులు పాల్గొన్నారు.

నేడు సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం

ఇచ్ఛాపురం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): బెల్లుపడ శివానంద గిరికొండపై గల వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యంస్వామి కల్యాణ మహోత్సవం శనివారం వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు త్రినాథస్వామి ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. వేకువ జామునుండే ప్రత్యేక అభిషేకాలతో పాటు పూజలు చేపట్టనున్నట్టు తెలిపారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్టు పేర్కొన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

ఆమదాలవలస, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు యువత, విద్యార్థులు దూరంగా ఉండాలని ఎస్ఐ కె.వెంకటేష్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ హైస్కూల్‌లో గంజాయి, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు వివరించారు. ఎంఈవో జి.రాజేంద్ర ప్రసాద్, పాఠశాల హెచ్‌ఎంలు కేపీ రాములు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి విద్యుత్ బిల్లు చెల్లించండి

ఆమదాలవలస, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారులు కరెంట్ మీటరు బిల్లు తీసిన వెంటనే ఆ బిల్లు కింద ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి విద్యుత్ బిల్లులు చెల్లించవచ్చునని విద్యుత్ పట్టణ ఏఈ జి.రామారావు తెలిపారు. ఫోన్ పే, గూగూల్ పే పేటీఎంల్లో గాని, స్కాన్ చేసి విద్యుత్ బిల్లును సులభంగా చెల్లించుకోవచ్చన్నారు. వినియోగదారుడికి ఇచ్చిన వ్యవధి తర్వాత ఆ బిల్లు మీద ఉన్న క్యూఆర్ కోడ్ పనిచేయదని, అలాగే నలిగిపోయినా స్కాన్ అవ్వదన్నారు. బిల్లు రీడర్ ఇచ్చిన వెంటనే స్కాన్ చేసి త్వరితగతిన చెల్లించికోవాలన్నారు. ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

షష్టి పూజలు ప్రారంభం

శ్రీకాకుళం కల్చరల్, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): నక్కవీధిలో ఉన్న ఉమాజఠకేశ్వరస్వామి ఆలయంలో శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామికి షష్టి మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. శుక్రవారం పంచమి సందర్భంగా స్వామివారికి సుగంధ ద్రవ్యాలతో అభిషేకం, విశేషాలంకరణ చేపట్టారు.

'పల్లె పండగ' పనులపై దృష్టిసారించాలి

ఎచ్చెర్ల, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పల్లె పండగ పనుల పూర్తికి దృష్టిసారించాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ (డ్వామా) పీడీ బి.సుధాకరరావు సిబ్బందికి సూచించారు. అజ్జరాం గ్రామంలో జరుగుతున్న ఇంకుడు గుంతల పనులతో పాటు, గోకులం పనులను ఆయన శుక్రవారం పరిశీలించారు. సిమ్మెంట్ రోడ్లు, కాలువల పనులు త్వరితగతిన పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. ఏపీవో శోభారాణి, ఈసీ నారాయణమ్మ, టీఏలు సురేష్, ప్రభాకర్ పాల్గొన్నారు.

పని భారం తగ్గించాలి

జి.సిగడాం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పని భారంతో పాటు ఒత్తిడి తగించాలని పంచాయతీ కార్యదర్శులు కోరారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంతో ఎంపీడీవో జి.రామకృష్ణకి వినతి పత్రం అందజేశారు. గ్రామాలను ప్రగతి పథంలో తీసుకువెళ్లేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న వివిధ పథకాలు అమలు చేయడంతోపాటు ఇతరిత్ర పనులు వల్ల పని భారం పెరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మండల పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు

ఆమదాలవలస, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ప్రభుత్వ భవనాల్లో ఉన్న సాంఘిక సంక్షేమ వసతిగృహాల మరమ్మతులకు రూ.33.33 లక్షలు ప్రభుత్వం మంజూరు చేసినట్టు టీడీపీ కార్యాలయం శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొంది. మంజూరైన నిధులు ఉపయోగించి సాంఘిక సంక్షేమ వసతిగృహాలను ఆధునీకరించనున్నట్టు తెలిపారు.

పనులు ప్రారంభించాలి

జి.సిగడాం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): పల్లె పండుగలో భాగంగా మంజూరైన పనులు తొందరగా ప్రారంభించాలని పీఆర్ డీఈ ఎస్.శ్రీరాములు అన్నారు. ఉపాధి హామీ పథకం ద్వారా మంజూరైనా ఇప్పటికీ పనులు ప్రారంభించని టీడీ వలస, జి.సిగడాం, నిద్దాం, పున్నాం బాతవ, వెంకయ్యపేట, సీతంపేట, జాడ, ఎస్‌పీఆర్ పురం, నడిమివలస గ్రామాల్లో ఆయన పరిశీలించారు. ఎంపీడీవో జి.రామకృష్ణ, ఈసీ జి.పురుషోత్తమరావు ఉన్నారు.

పాఠశాలల్లో వైద్య పరీక్షలు

జలుమూరు, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలో పలు ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు శుక్రవారం వైద్య పరీక్షలను నిర్వహించారు. విద్యార్థుల శారీరక పెరుగుదలకు పౌష్టికాహారం తీసుకోవాలని పీహెచ్‌సీ వైద్యులు గాయత్రి సూచించారు. సమగ్ర శిక్షా సీఆర్‌ఎంటీ వైకుంఠరావు, హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

జాగ్రత్తలు తీసుకోవాలి

నరసన్నపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): ఆడపిల్లలను చదివించడంతో పాటు వారి స్వీయ రక్షణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని వన్‌స్టాప్ ఏవో వై.హిమబిందు, బి.కవిత సూచించారు. శుక్రవారం సత్యవరం ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.



















అంటరానితనంపై అంబేడ్కర్ అలుపెరుగని పోరాటం

● కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్
● జిల్లా వ్యాప్తంగా వర్ధంతి వేడుకలు

గుజరాతీపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): నాటి సమాజంలో ఉన్న వివక్షను రూపుమాపేందుకు అంబేడ్కర్ చేసిన అలుపెరుగని పోరాటం మరువలేనిదని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా శుక్రవారం నగరం లోని అంబేడ్కర్ కూడలి వద్ద ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించి కలెక్టర్ మాట్లాడారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ ఉప సంచాలకులు విశ్వమోహన్ రెడ్డి, దళిత సంఘ నాయకులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. అలాగే అంబేడ్కర్ కూడలిలో శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్, రిమ్స్‌లో సూపరింటెండెంట్ షకీలా, డీడీ సీహెచ్ శ్రీనివాస్, జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ మహేశ్వర రెడ్డి, ఆమదాలవలసలో ఎమ్మెల్యే కూన రవికుమార్, పలాసలో ఎమ్మెల్యే గౌతు శిరీష, ఎచ్చెర్లలోని అంబేడ్కర్ యూనివర్సిటీలో వీసీ రజని అంబేడ్కర్ విగ్రహాలు , చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అలాగే జిల్లా వ్యాప్తంగా అంబేడ్కర్ వర్ధంతిని పలు సంఘాలు, కార్యాలయాల్లో నిర్వహించారు. కార్యక్రమాల్లో వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.


గుజరాతీపేట: అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ పుండ్కర్


ఆమదాలవలస: అంబేడ్కర్ విగ్రహానికి నమస్కరిస్తున్న ఎమ్మెల్యే కూన రవికుమార్



ఎచ్చెర్ల వీసీ రజని, కాశీబుగ్గలో ఎమ్మెల్యే గౌతు శిరీష అంబేడ్కర్ విగ్రహాల వద్ద నివాళి అర్పిస్తున్న దృశ్యం

క్రైం కార్నర్

టీడీపీ కార్యకర్తలపై వైసీపీ మూకల దాడి

● ఏడుగురికి గాయాలు


వైసీపీ వర్గీయుల దాడిలో గాయపడిన భగవాన్, తుమ్మనాథం

హరిపురం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మందస మండలం బుడార్సింగి పంచాయతీ పాతకోట గ్రామంలో వైసీపీ, టీడీపీ కార్యకర్తల మధ్య శుక్రవారం వాగ్వాదం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. కొందరు వ్యక్తులు సారా తాగి గ్రామంలో గలాటా సృష్టిస్తుండగా టీడీపీ కార్యకర్తలు అడ్డుకున్నారు. దీంతో అడ్డుకున్న టీడీపీ కార్యకర్తలపై సుమారు 10 మంది వైసీపీ కార్యకర్తలు కర్రలు, కత్తులతో దాడికి పాల్పడడంతో టీడీపీ పార్టీ డిజిటల్ అసిస్టెంట్ భగవాన్ బిస్వాల్, బుయ్య, తుమ్మనాథంతో పాటు మరో నలుగురు మహిళలకు తీవ్ర గాయాల య్యాయి. ఈ దాడిలో గ్రామానికి చెందిన అంగన్‌వాడీ కార్యకర్త, ఆమె భర్త పాల్గొన్నట్లు బాధితులు తెలిపారు. పాత కక్షలతోనే తమపై దాడులకు పాల్పడినట్లు బాధి తుల కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. క్షతగాత్రులను హరిపురం ఆసు పత్రికి తరలించి చికిత్స చేశారు. అనంతరం కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు మం దస పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. బాధితులను టీడీపీ నాయకులు బావన దుర్యోధన, రట్టి లింగరాజు తదితరులు పరామర్శించారు.

శ్రీకూర్మంలో ఒకరి హత్య

గార, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): శ్రీకూర్మం గ్రామంలో శుక్రవారం రాత్రి ఉప్పాడ రాజేష్(37) హత్యకు గురవ్వగా, చుక్క రాము అనే వ్యక్తి గాయపడ్డాడు. గాయపడిన వ్యక్తికి 108 వాహనంలో చికిత్స నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. శ్రీకూర్మం హైస్కూల్ సమీపంలో రాజేష్‌పై గుర్తుతెలియని వ్యక్తులు కర్రలు, కత్తులతో దాడిచేయగా, అతడు అక్కడికక్కడే మరణించాడు. అతడి పక్కనే ఉన్న చుక్క రాము గాయపడ్డాడు. సమాచారం తెలుసుకున్న గార ఎస్ఐ ఆర్.జనార్దన రావు, సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. భూ వివాదాలే ఈ హత్యకు కారణంగా స్థానికులు భావిస్తున్నారు. కాగా ఈ ఘటనతో శ్రీకూర్మం ప్రజలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు.

అక్రమంగా తరలిస్తున్న పశువుల పట్టివేత

కోటబొమ్మాళి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): చలమయ్యపేట గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై నుంచి అక్రమంగా తరలిస్తున్న పశువులను పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. మినీ వ్యాన్‌లో నాలుగు ఆవులు, ఐదు దూడలను తరలిస్తుండగా తనిఖీ చేసి వ్యాన్ డ్రైవర్ బడ్డి సింహాచలం, పశువుల వ్యాపారి రావాడ శంకరరావును అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు. పశువులను విశాఖపట్నం జిల్లా కొత్తవలస గోశాలకు తరలించామన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

పాముకాటుకు మహిళ మృతి


మృతిచెందిన దాసరి రమణమ్మ

టెక్కలి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): గూడేం పంచాయతీ పిట్టలసరియా గ్రామంలో శుక్రవారం వ్యవసాయ పనులు చేస్తుండగా దాసరి రమణమ్మ(50) పాము కాటుకు గురైంది. వెంటనే తోటి కూలీలు ఆమెను జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించి వైద్యసేవలు అందిస్తుండగా మృతి చెందింది. ఈ మేరకు సీఐ విజయ్‌కుమార్ కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

నాటు బాంబు కడుతుండగా పేలి తీవ్ర గాయాలు


గాయపడిన సాయిరాం

టెక్కలి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): టెక్కలి మేజర్ పంచాయతీ ఆదీఆంధ్రా వీధికి చెందిన దేవాది సాయిరాం అడవి పందుల కోసం తన పాత నివాసంలో నాటుబాంబులు తయారు చేస్తుండగా అవి పేలడంతో రెండు చేతులకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే క్షతగాత్రుడిని జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. అయితే పుష్ప-2 రిలీజ్ సందర్భంగా గురువారం రాత్రి క్రాకర్స్ పేలుస్తుండగా చేతిలో పేలిందని గాయపడిన సాయిరాం పోలీస్‌లకు సమాచారం ఇచ్చాడు. మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు, అక్కడి నుంచి విశాఖకు తరలించారు. ఈ మేరకు సీఐ విజయ్‌కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

టెక్కలి డీఎస్పీగా డీఎస్ఆర్‌వీఎస్ఎన్ మూర్తి



టెక్కలి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): టెక్కలి డీఎస్పీగా డీఎస్ఆర్‌వీఎస్ఎన్ మూర్తి శుక్రవారం బాధ్యతలు చేప ట్టారు ఈ సందర్భంగా ఆయనను సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐ, సిబ్బంది వచ్చి మర్యాదపూర్వకంగా కలిసి అభినం దించారు.

ట్రాక్టర్ ప్రమాదంలో వ్యక్తి మృతి


వడిసి గోపి(ఫైల్)

కోటబొమ్మాళి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): లఖందిడ్డి పంచాయతీ తలగానిపేట గ్రామానికి చెందిన వడిసి గోపి (34) ట్రాక్టర్ ప్రమాదంలో మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. శుక్రవారం సాయంత్రం పొలం పనుల్లో భాగంగా ట్రాక్టర్‌కు రోటావేటర్ అమర్చే సమయంలో స్టార్ అయి ఉన్న ట్రాక్టర్ గేర్ పడి బోల్తాపడింది. దీంతో ఆ ట్రాక్టర్ కింద ఇరుక్కుపోయిన గోపి అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి భార్య లక్ష్మి, కుమార్తె, కుమారుడు ఉన్నారు. పెద్ద దిక్కు మృతితో కుటుంబం రోడ్డునపడిందని బంధువులు రోదిస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం సామాజిక ఆసుపత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వి.సత్యనారాయణ తెలిపారు.

వాహనం ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

జి.సిగడాం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): విజయరాంపురం గ్రామ సమీపంలో సెప్టిక్ ట్యాంక్ వాహనం ఢీకొని సీతారాంపురం గ్రామానికి చెందిన పలిశెట్టి శ్రీనివాసరావు తీవ్రంగా పాలయ్యాడు. శుక్రవారం పోలీసులు ఇచ్చిన వివరాలు ప్రకారం శ్రీనివాసరావు విజయరాంపురం సమీపంలో చెట్టు వద్ద నిలబడగా... అదే గ్రామం నుంచి వస్తున్న వాహనం అదుపు తప్పి శ్రీనివాసరావును ఢీకొనడంతో గాయపడ్డాడు. శ్రీనివాసరావుకు కాళ్లు విరిగిపోవడంతో పాటు తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం శ్రీకాకుళంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ఈ వాహనం విజయనగరం జిల్లా రాజాంకు చెందిన సజ్జల రామాంజనేయులుకు చెందినది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వై.మధుసూదనరావు తెలిపారు.

పుష్ప-2 సినిమా చూసేందుకు వెళ్తూ..

● రైలు ప్రమాదంలో శ్రీకాకుళం వాసి దుర్మరణం

దొడ్డబళ్లాపుర, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అల్లు అర్జున్ నటించిన పుష్ప-2 సినిమా చూసేందుకు వెళ్ళే ఆత్రుతలో ఒక యువకుడు రైలుకింద పడి దుర్మరణం చెందిన సంఘటన దొడ్డబళ్లాపుర తాలూకాలో చోటు చేసుకుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం శ్రీకాకుళం జిల్లాకు చెందిన ప్రవీణ్ (19) మృతి చెందిన యువకుడు ఇతడు బాశెట్టిహళ్ళిలోని ఓ ఫ్యాక్టరీలో పనిచేసేవాడు. ఐటిఐ పూర్తి చేసి రెండు నెలలక్రితం బాశెట్టిహళ్ళి పారిశ్రామికవాడలోని ఓ సంస్థలో చేరాడు. స్నేహితులు తెలిపిన వివరాల మేరకు.. గురువారం పుష్ప-2 సినిమా చూసేందుకు ఉదయం మిత్రులతో కలసి టాకీస్‌వైపు బయల్దేరారు. బాశెట్టిహళ్ళి వద్ద రైల్వేక్రాసింగ్ దాటుతుండగా ఒక వైపు నుంచి గూడ్స్, మరోవైపునుంచి గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలు వచ్చాయి. గూడ్స్ రైలు మధ్య యువకుడు చిక్కుకుని మృతి చెందాడు. తోటి మిత్రులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. దొడ్డబళ్లాపుర అవుట్‌పోస్ట్ పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. యశ్వంతపుర రైల్వే పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

20లీటర్ల సారా స్వాధీనం

కంచిలి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): జలంత్రకోట గ్రామానికి చెందిన రత్నాల అర్జున్ ఇంట్లో అక్రమంగా నిల్వ ఉంచిన 20లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పి.పారినాయుడు తెలిపారు. సారాతో పట్టుబడిన వ్యక్తిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరిచామని ఆయన తెలిపారు.

సుస్థిరాభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలి

పలాసరూరల్,డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సుస్థిరాభివృద్ధి లక్ష్యంగా ప్రణాళికలను సిద్ధం చేయాలని ఎంపీడీవోలు వసంత్ కుమార్, ఎన్.రమేష్‌నాయుడు అన్నారు. పలాస మండల కార్యాలయంలో శుక్రవారం పలాస డివిజన్ పరిధిలోని మండలస్థాయి అధికారులకు పంచాయతీల అభివృద్ధిపై శిక్షణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం అంది స్తున్న నిధులతో గ్రామాల అభివృద్ధి చేపట్లాన్నారు. కార్యక్రమంలో పంచాయతీ విస్తర ణాధికారి మెట్ట వైకుంఠరావు, ఉపాధి ఏపీవో శంకర రావు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

రాజ్యాంగంపై దాడులను తిప్పికొట్టాలి


మాట్లాడుతున్న చిట్టిబాబు

పలాసరూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగం హక్కులు, రాజ్యాంగంపై జరుగు తున్న దాడులను తిప్పికొట్టాలని పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేడంగి చిట్టిబాబు అన్నారు. బొడ్డపాడులో డాక్టర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాజ్యాంగంలో ఉన్న ఆర్టికల్స్ సహజ హక్కులను కాపాడు కోవాలని కోరారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో డీటీఎఫ్ గౌరవాధ్యక్షుడు కోత ధర్మారావు, పౌరహక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు పత్రి దానేసు దేశభక్త ప్రజాతంత్ర నాయకుడు వై.వెంకటేశ్వరరావు, కుల నిర్మూలన పోరాటసమితి నాయకుడు ఎం.కృష్ణయ్య దుర్యోధన, జోగారావు, పీవోడబ్ల్యూ నాయకురాలు కుసుమ పాల్గొన్నారు.

విద్యకు ప్రాధాన్యం: ఎమ్మెల్యే శిరీష

హరిపురం, డిసెంబరు6 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంలో విద్యకు అత్యంత ప్రాధాన్యం ఇస్తున్నట్లు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. సొండిపూడి గ్రామంలో నిర్మించిన పాఠశాల అదనపు భవనాలను శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఎన్నడూ లేని విధంగా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో పండగ వాతావరణంలో తల్లిదండ్రుల సమావేశాలను ఏర్పాటు చేస్తున్నామన్నారు. మధ్యాహ్న భోజనంలో మెనూ మార్పులు, నిర్వాహకులకు యూనిట్ వ్యయం పెంపు, మెగా డీఎస్సీ ద్వారా ఉపాధ్యాయ పోస్టుల భర్తీ ద్వారా పాఠశాలలను బలోపేత చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఈవో లక్ష్మణరావు, రాష్ట్ర కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ బావన దుర్యోధన, టీడీపీ నాయకులు రట్టి లింగరాజు, లబ్బ రుద్రయ్య, దేబాసిస్ పండా, తమిరి భాస్కరరావు, దాసరి తాతారావు పాల్గొన్నారు.

'వైసీపీ పాలనలో భూ రికార్డుల తారుమారు'

వజ్రపుకొత్తూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో భూ రికార్డులను తారుమారు చేసి గందగోళానికి గురిచేశారని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మోట్టూరులో శుక్రవారం రైతు సదస్సు నిర్వహించారు. గత ఐదేళ్లలో కొండలు, గుట్టలు దోచుకున్నారని, అధికారుల నుంచి రికార్డులు తీసుకుని సమాచారం మార్చివేశారని ఆరోపించారు. భూముల రీ సర్వే పేరుతో అనేక మోసాలకు పాల్పడ్డారని విమర్శించారు. ఆర్డీవో వెంకటేష్ మాట్లాడుతూ.. ప్రజలు సహకరిస్తే భూ సమస్యలు పరిష్కారమవుతాయన్నారు. సమావేశంలో డీటీ మురళీకృష్ణ, మాజీ వైస్ ఎంపీపీ దాసరి జేజే రావు, ఎంపీటీసీ సురేఖ, టీడీపీ నేతల సూరాడ మోహనరావు, బుల్లోజు శశిభూషణ్, దుర్యోధనరెడ్డి పాల్గొన్నారు.

మెగా పేరెంట్, టీచర్ల సమావేశాలకు ఏర్పాట్లు


నందిగాం ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన షామియానాలు

నరసన్నపేట, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రభుత్వ పాఠశాలలో శనివారం నిర్వహించనున్న మెగా పేరెంట్స్ వేడుకలకు కలెక్టర్ హాజరు కానున్న నేపథ్యంలో ఏర్పాట్లను శుక్రవారం డిప్యూటీ డీఈవో విజయకుమారి, ఎంఈవోలు ఉప్పాడ శాంతారావు, పి.దాలినాయుడులు పరిశీలించారు. స్థానిక ఉన్నత పాఠశాలలో పేరెంట్స్ డేకి సుమారు 600 మంది విద్యార్థుల తల్లి దండ్రులు, మరో 200 మంది అతిథులు వచ్చే అవకాశం ఉన్నందున గ్రౌండ్‌ను సిద్ధం చేశారు. పాఠశాల మైదానంలో తల్లలకు ఆటల పోటీలు నిర్వహణతో పాటు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉర్లాం, సత్యవరం, బాడాం, మడపాం, లుకలాం, సుందరాపురం తదితర పాఠశాలలను మండల విద్యాశాఖాధికారులు పరిశీలించారు.

95 పాఠశాలల్లో..

పోలాకి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉన్నత, ప్రాథమికోన్నత, ప్రాథమిక కలుపుకుని మొత్తం 95 పాఠశాలల్లో శనివారం తల్లిదండ్రుల సమావేశాలు నిర్వహిస్తున్నట్లు ఎంఈ వో శ్రీనివాసనాయక్ తెలిపారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. పోలాకి, కోడూరు ఉన్నత పాఠశాల ల్లో పెద్దఎత్తున సమావేశాలు నిర్వహించాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు వచ్చి నందున ఆ దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. అలాగే ఈదులవలస మోడల్ స్కూల్‌లో విద్యాకమిటీ సభ్యులతో శుక్రవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ వివిధ అంశాలపై చర్చించారు.

మెగా పీటీఎంకు ఏర్పాట్లు

నందిగాం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాఠశాలల్లో శనివారం నిర్వహించనున్న మెగా పేరెంట్స్ టీచర్స్ మీట్‌కు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఉన్నత, ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల హెచ్‌ఎంల నేతృత్వంలో ప్రభుత్వ సూచనల మేరకు పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రులు రానున్నందున పాఠశాలల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏర్పాట్లపై ఎంపీడీవో టి.రాజారావు, ఎంఈవో జి.నర్సింహులు శుక్రవారం పరిశీలించారు.

పండగ వాతావరణంలో పీటీఎంలు

పాతపట్నం, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): పేరెంట్, టీచర్ల సమావేశాలు పండగ వాతావరణంలో నిర్వహించాలని జిల్లా నోడల్ అధికారి, డైట్ కళాశాల ప్రిన్సిపాల్ గౌరీశంకర్ అన్నారు. స్థానిక ప్రభు త్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాట్లను శుక్రవారం పరిశీలించారు. కొరసవాడ జడ్పీ హైస్కూల్‌ను మండల ప్రత్యేకాధికారి మంచు కరుణాకర రావు సందర్శించి తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో ఎంపీడీవో పి.చంద్రకుమారి, హెచ్‌ఎంలు ఎస్.వైకుంఠరావు, బి.సింహాచలం పాల్గొన్నారు.

మహిళా మార్టును విస్తరించాలి: డీఆర్‌డీఏ పీడీ



నరసన్నపేట, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): మహిళా మార్టు వినియోగదారులను ఆకట్టుకునేలా విస్తరించాలని డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో సిబ్బందితో సమీక్షించారు. స్త్రీనిధి ద్వారా రుణాలు పొంది ఆర్థికంగా స్వావలంబన సాధించేలా సంఘాలను సిద్ధం చేయాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం అప్పలరామయ్య, పాల్గొన్నారు.

● పోలాకి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): స్వయంశక్తి సంఘాల మహిళలు వ్యాపారవేత్తలుగా ఎదగాలని డీఆర్‌డీఏ పీడీ పెద్దింటి కిరణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం పోలాకి వెలుగు కార్యాలయంలో మహిళా సమాఖ్య సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సంద్భంగా ఆయన మా ట్లాడుతూ.. ప్రభుత్వం మహిళలకు చేయూత ఇచ్చేదిశగా స్త్రీనిధి, బ్యాంక్ రుణాలు అందజేస్తోం దని, వీటిని వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో వెలుగు ఏపీఎం గోరురాజారావు తదితరులు పాల్గొన్నారు.

104 సిబ్బంది సమస్యలు పరిష్కరించండి

పలాసరూరల్, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): తమ సమస్యలను పరిష్కరించాలని 104 వాహనాల సిబ్బంది కోరారు. ఈ మేరకు శుక్రవారం ఎమ్మెల్యే గౌతు శిరీషకు వినతిపత్రం అందజేశారు. 2020 తరవాత విధుల్లో చేరిన డ్రైవర్లు, డీఈవోకు జీవో-7 ద్వారా వేతనాలు అందించాలని, కోరారు. 104 సిబ్బంది రామారావు, మురళి, ఉమా, క్రాంతి, సత్యనారాయణ పాల్గొన్నారు.

ఘనంగా శ్రీనివాస కల్యాణం

టెక్కలి, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో శుక్రవారం అలివేలుమంగ సమేత వెంకటేశ్వరస్వామి శాంతి కల్యాణం నిర్వహించారు. శ్రీమద్భాగవత సప్త సప్తాహంలో భాగంగా అర్చకులు చామర్తి వెంకట రమణాచార్యులు ఆధ్వర్యంలో కల్యాణం చేపట్టారు.

న్యూస్ బాక్స్

పశుగణనకు పాడి రైతులు సహకరించాలి

కోటబొమ్మాళి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో చేపడుతున్న పశు గణనకు పాడి రైతులు సహకరించాలని జిల్లా పశుగణన పర్యవేక్షణ అధికారి జి.నారాయణ రావు అన్నారు. కిష్టపురం, కొత్తపేట, కోటబొమ్మాళి గ్రామాల్లో పశుగణనను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. టెక్కలి డివిజన్‌లో 109 ఎన్యుమరేటర్లు 925 గ్రామాల్లో పశుగణన చేయాల్సి ఉండగా ఇప్పటివరకు 379 గ్రామాల్లో 1,22,188 కుటుంబాల్లో పశుగణన చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో పశు సంవర్థకశాఖ ఏడీ ఎం.లోకనాథం, పశు వైద్యాధికారి ఎల్. కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడి మృతి బాధాకరం

సంతబొమ్మాళి, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లా రాయచోటిలో ఉపాధ్యాయుడు ఎజాజ్ అహ్మద్ అనుమానాస్పద స్థితిలో మృతి చెందడం బాధాకరమని ఉపాధ్యాయులు అన్నారు. ఈ మేరకు శుక్రవారం బోరుభద్ర జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీ ధరించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం పి.రామకృష్ణ, సాంఘికశాస్త్ర ఉపాధ్యాయ ఫోరం జిల్లా ప్రధాన కార్యదర్శి బాడాన రాజు, త్రినాథరావు, తవిటరెడ్డి పాల్గొన్నారు.

సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలి

వజ్రపుకొత్తూరు, డిసెంబరు 6 (ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలకు గురికాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ బి.నిహార్ అన్నారు. శుక్రవారం బాతుపురంలో ప్రజలకు అవగాహన కల్పించారు. అపరిచితుల నుంచి వచ్చిన ఫోన్ కాల్స్‌కు స్పందించ వద్దన్నారు. వారికి వ్యక్తిగత వివరాలు ఇవ్వవద్దన్నారు.

14న జాతీయ లోక్‌అదాలత్

పాతపట్నం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఈనెల 14న జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నామని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని న్యాయాధికారి సీహెచ్ హరిప్రియ ఒక ప్రకటనలో కోరారు. తెలిపారు. రాజీ మార్గం ద్వారా సమస్యలను పరిష్కరించుకో వచ్చన్నారు. 14న ఉదయం 10.30గంటలకు నిర్వహించనున్న కార్యక్రమంలో కక్షిదారులు సమస్యలను పరిష్కరించుకునేలా న్యాయవాదులు, పోలీసులు కృషి చేయాలన్నారు.

నేడు మండల సమావేశం

పాతపట్నం, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 10.30 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో పి. చంద్రకుమారి తెలిపారు. సభ్యులతోపాటు అన్ని శాఖాధికారులు హాజరుకావాలని ఆయన కోరారు.